
# ఫ్లాష్ బ్యాక్




పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

# ఎల్వీ. ప్రసాద్

## ( కినిమా, 1952, సెప్టెంబర్ సంచిక నుంచి)

మాది పెద్ద రైతు కుటుంబం. నేనాట్టే చదువుకోలేదు గాని కాడిగట్టి పొలం దున్నాను. అయితే 1929 ఆఖరుదినాలలో మా కుటుంబం ఆర్థిక పరిస్థితులు విషమించి తలవంపులుగా యెంచబడే పని జరిగింది. మా నాయనగారు దివాళా పిటీషన్ పెట్టవలసి వచ్చింది. దానిమీద సంతకం పెట్టేసి, ఆ రాత్రే నూరు రూపాయలు తీసుకుని, నా భార్యా బిడ్డలకు సైతం చెప్పకుండా బొంబాయి బయలుదేరాను. నాకు బాగా జ్ఞాపకం, నేను యిల్లు విడిచినది 1929లో, బొంబాయి చేరినది 1930 లో.

బొంబాయి చేరి దాదర్ లో ఒక హోటల్లో మకాం పెట్టాను. నాకంతా అయోమయం. ఎవరితోనూ మాట్లాడటానికిలేదు. నాకు వచ్చిన ఇంగ్లీషు బహుకొద్ది. హిందూస్థానీ, మరాఠీ భాషలు అసలే రావు. నా దుస్థితి కనిపెట్టి ఎవడో నా పెట్టెలో వున్న డబ్బు కొట్టేసి 20 రూపాయలు మాత్రం వదిలేశాడు. ఎందుకో నాకప్పుడర్థం కాలేదు. తరవాత నేను ఒక సినిమా కంపెనీకు మేనేజరుగా వుండగా యీ మనిషే నా దగ్గరికి వేషం కోసం వచ్చి, నన్ను చూసి ఆశ్చర్యపడి, "ఇంకా నువ్విక్కడే వున్నావా? నీ తిరుగు రైలు చార్జీకి 20 రూపాయలు ఉంచానే?" అన్నాడు. నా సంగతి వాడెరగడు. ఇంటికి ఉత్తరం ముక్క




రాయకుండా, నా ఆచూకీ నా భార్యాబిడ్డలకు తెలియకుండా నేను బొంబాయిలో 21 మాసాలు గడిపాను. తిరిగి నా వార్తలు మా వాళ్ళకూ, వాళ్ళ వార్తలు నాకూ తెలిసేలోగా నా కుమార్తె చనిపోవటం కూడా జరిగింది...

బొంబాయిలో దిగిన కొత్తలో రోజూ కోహినూరు సినిమాకు వెళ్ళి గేటుదగ్గర నిలబడి లోపలికి చాలాసేపు ఆశగా చూసి హోటలుకి తిరిగివచ్చేవాణ్ణి. కాని దగ్గిరవున్నది 20 రూపాయలు. ఎంతకాలం

వస్తాయి? హోటలు వాడు నాకు ఉద్వాసన చెప్పాడు. ఈ విధంగా వీధిలో నిలబడిన నాకు ఒక దర్జీవాడు ఆశ్రయమిచ్చాడు. నా పెట్టె ఆ దర్జీ కొట్టులో వుంచాను. రాత్రి వేళలో కొట్టులో పడుకునే వాణ్ణి. తెల్లవారి లేచి కొట్టంతా శుభ్రంగా ఊడ్చేవాణ్ణి. నాకు సినిమాల్లో ప్రవేశించాలని వుందని తెలిసి ఈ దర్జీవాడే నాకు వీనస్ పిక్చర్స్ లో పనియిప్పించాడు. పేరుకు నెలజీతం 15 రూపాయలు. కాని, ఈ జీతం దబ్బులు మొహం నేనెన్నడూ చూసిన పాపాన పోలేదు. ఈ వీనస్ పిక్చర్స్ వారు చిత్రమే తీయలేదు.

అయినా ఒక ఉపకారం జరిగింది. ఆ రోజుల్లో మిస్ మోతీ అని ఒక సినిమా తార వుండేది. ఈమె సోదరుడు ధారీలాల్ అనేవాడు వీనస్ పిక్చర్స్ లో వుండేవాడు. ఇతను నాకు గ్రాంట్ రోడ్డులో వుండే కార్నివాల్ లో పనియిప్పించాడు. రాత్రుళ్ళు అక్కడ పని చేసి, కార్నివాల్ ముగిసిన తర్వాత రెండు గంటల వేళ... బస్సులూ, ట్రాములూ వుండవు.. నాలుగైదు మైళ్ళు దాదరుకు నడిచి దర్జీదుకాణం చేరి, అక్కడ కాసేపు పడుకుని, మళ్ళీ 6 గంటలకు లేచి కొట్టు శుభ్రం చేసి, రైలు మీద శాంటాక్రుజ్ లో వీనస్ పిక్చర్స్ కు హాజరయేవాణ్ణి. కార్నివాల్ వాళ్ళు నాకు రోజూ రూపాయిన్నర ఇచ్చేవారు. దీనితోనే నాఖార్చులన్నీ సరిపెట్టుకునేవాణ్ణి.

3, 4 నెలలు గడిచాక వీనస్ పిక్చర్స్ దివాళా తీసింది.

తరవాత అఖ్తర్ నవాజ్ కు చెందిన ఇండియా పిక్చర్స్ లో చేరి "స్టార్ ఆఫ్ ది ఈస్ట్" అనే మూకీ చిత్రంలో చిల్లర వేషం వేశాను. ఆ రోజుల్లో చిల్లరనటులచేత వెట్టిచాకిరీ చేయించేవారు. ఎక్కడికైనాపోతే సామాన్లు మొయ్యాలి, రిఫ్లెక్టర్లు మొయ్యాలి, వట్టి కూలిపని. ఒకసారి అఖ్తర్ నవాజ్ షూటింగుకని మమ్మల్ని యెక్కడో మారుమూల స్థలానికి తీసుకుపోయాడు. రైలు స్టేషనుకు 15 మైళ్ళ దూరాన ఒక రహదారి బంగాళాలో మకాం చేశాం. దగ్గిర డబ్బులేదేమో అఖ్తర్ నవాజ్ రాత్రికి రాత్రే మాకెవరికీ చెప్పకుండా పరారీ అయినాడు. మా పాట్లు పరమాత్ముడికెరుక. రెండు రోజులు ఎవరికీ తిండిలేదు. ఆ తరవాత 15 మైళ్ళు నడిచి స్టేషనుకు చేరి, చావుతప్పి కన్ను లొట్టబోయి, యెట్లాగో బొంబాయి వచ్చిపడ్డాం.

ఆ తరువాత అర్దేషిర్ ఇరానీ కింద ఇంపీరియల్ ఫిలిం కంపెనీలో నెలకు ముప్ఫై రూపాయల జీతం మీద నటుడుగా చేరాను. ఈ ఇంపీరియల్ ఫిలిం కంపెనీలో దాదాపు రెండేళ్ళున్నాను. ఈ కాలంలోనే వీరు మొట్టమొదటి బారతీయ టాకీ చిత్రం "అలం ఆరా" తీశారు. ఇందులో నేను చిల్లర వేషాలు వేశాను. నేను ఇంపీరియల్ లో ఉండగానే నాకు హెచ్.ఎం.రెడ్డి గారి పరిచయం కూడా అయింది. ఆయన అక్కడికి వచ్చి "కాళిదాస్" అనే చిన్న టాకీ చిత్రం హిందీలో తీశారు. ఇందులో నేను పురోహితుడి పాత్ర ధరించాను.

1933 లో కాబోలు ఇంపీరియల్ కంపెనీలో ఉద్యోగులను తగ్గించారు. దాంతో నేను వీధిలో వచ్చిపడ్డాను. నా నిరుద్యోగానికి తెరమరుగులాగా కృష్ణా సినిమాలో డోర్ కీపర్ పని దొరికింది. ఈ పని చేస్తూనే హెచ్.ఎం.రెడ్డిగారి "భక్త ప్రహ్లాద" లో చండామార్కులు వేషమూ, "సావిత్రి"లో సత్యవంతుడి మిత్రుడి వేషమూ వేశాను.

అనంతరం రెడ్డిగారు దాదర్ లోని విజయా సినీటోన్ లో "సీతా స్వయంవర్" అనే హిందీ చిత్రాన్ని డైరెక్టు చెయ్యటానికి కుదిరారు. ఆ చిత్రంలో నేను వేషం వేశాను. చిత్రం పూర్తికాకపూర్వమే కంపెనీ వారికి రెడ్డిగారికీ ఏవో విభేధాలు ఏర్పడి ఆయన వెళ్ళిపోయారు. నేను మాత్రం చిత్రం పూర్తి అయినదాకా కంపెనీలో ఉండి, తరువాత ఆ కంపెనీకు రిప్రెజెంటేటివుగా కుదిరి, ఆ చిత్రం తాలూకు టిన్నులు పట్టుకొని బొంబాయి రాష్ట్రమంతటా తిరిగాను. తరువాత నేనా కంపెనీకి ఆఫీసు మేనేజర్ కూడా అయినాను. అయితే కొద్దిరోజులకే ఆ కంపెనీ రద్దయింది.

ఇక్కడి నుంచి నేను న్యూ ఈరా పిక్చర్స్ కు వెళ్ళాను. దాని ప్రొప్రయిటరు రజనకాంత పాండ్యా, ఈయన ప్రస్తుతం బొంబాయి శ్రీ సౌండ్ స్టూడియోస్ కు అధిపతి. న్యూ ఈరా వారు అప్పుడు తీయనున్న "మత్స్యగంధి" (భీష్మ ప్రతిజ్ఞ) చిత్రానికి నన్ను ప్రొడక్షన్ మేనేజరుగా నియమించారు. ఈ చిత్రం పూర్తికాగానే రేణు పిక్చర్స్ (దాదర్) లో చేరాను. ఈ కంపెనీ వారు ఒక కెమేరా, సౌండ్ ట్రక్ కొని చిత్రాలు తీయబోతున్నారు. ఈ కంపెనీకి నేను మేనేజరుగానూ, అసిస్టెంటు కామెరామాన్ గానూ కుదిరాను. 1937లో జమ్నాదాస్ కపాడియా కింద "స్త్రీ" అనే చిత్రానికి కెమెరాపని చేశాను.

నాకు అసిస్టెంటు డైరెక్టర్ అవకాశాన్ని మొదట ఇచ్చిన వాడు గజన్ ఫరాలీషా. ఇతను భయంకరుడు. కోపం వచ్చినప్పుడల్లా పిస్తోలు తీసేవాడు. (అతనికి పిస్తోలు లైసెన్స్ ఉండేది.) అతనికింద ఎవరూ అసిస్టెంటుగా పనిచెయ్యలేక పోయే వారు. కాని నేను అతనికింద పనిచేసినంతకాలం అతనితో నాకు ఏ పేచీ రాలేదు. ప్రస్తుతం గజన్ ఫరాలీషా అనే ఆయన పాకిస్తాను మంత్రిగా ఉన్నట్టున్నది. ఈయనే ఆయనేమో నాకు తెలియదు.

ఒక కంపెనీ అని లేకుండా దొరికిన చోటనల్లా చిల్లర వేషాలు వేస్తూ బొంబాయిలో మరి రెండేళ్ళు గడిపిన అనంతరం 1940 లో హెచ్.ఎమ్.రెడ్డి గారు నన్ను మద్రాసుకు తీసుకొచ్చారు. ఆయనకు సహాయంగా ఉంటూ "సత్యమే జయం" "తెనాలి రామకృష్ణ" చిత్రాలలో వేషాలు కూడా వేశాను.

తిరిగి 1942 లో తాండ సుబ్రహ్మణ్యం గారు "కష్టజీవి" తీయటానికి బొంబాయి బయల్దేరితే దాన్ని డైరెక్టు చేయటానికి నేను వెంటవెళ్ళాను. ఈ చిత్రం మూడు రీల్సు పూర్తి అయినాక ఆగిపోయింది. నేను గీతాంజలి పిక్చర్స్ కు అసిస్టెంటు డైరెక్టరుగా చేరి "సవాల్" అనే చిత్రానికి పని చేశాను. ఇందులో ముంతాజ్ శాంతీ, ఉల్లాస్ ప్రధాన పాత్రలు ధరించారు. దీని తరువాత ముంతాజ్ శాంతి భర్త వల్లీ సాహెబ్ "లేడీ డాక్టర్" డైరెక్షనుకు కుదిరినప్పుడు నేనాయనకు అసిస్టెంటుగా పని చేశాను.

తరువాత డైరెక్టర్ యూసుఫ్ నన్ను అసిస్టెంటుగా తసుకున్నాడు. "దర్బాన్", "నేక్ పర్వీన్" చిత్రాలు తీశాము. కుమార్ తీసిన "దేవర్" చిత్రానికి స్క్రిప్టు రాశాను.

ఇంతలో పృథ్వీరాజ్ కపూర్ పృథ్వీ థియేటర్స్ పెట్టి నాటకాలాడనారంభించాడు. మొదట "శకుంతల" ఆడాడు. తరవాత "దివార్". ఈ రెండు నాటకాలలోనూ నేను అనేక చిన్న పాత్రలు ధరించాను.

1945 ఆగస్టులో, "గృహప్రవేశం" చిత్రం డైరెక్టు చేయటానికి మద్రాసు వచ్చి ఇక్కడి సినిమా ప్రపంచంలో ఒక డైరెక్టరుగా స్థిరపడిపోయాను.

ఏతావాతా చెప్పవచ్చిందేమంటే నేను పడ్డ కష్టాలన్నీ బొంబాయిలోనే పడ్డాను. బొప్పెలన్నీ అక్కడే తగిలాయి. కాని నేర్చుకోవలసిందంతా కూడా అక్కడే నేర్చుకున్నాను. బొంబాయి ముఖ్యంగా నాకు ఓపిక నేర్పింది. ఏమైనా సాధించాలంటే ఎంతో ఓపిక అవసరం. ముఖ్యంగా ఈ సినిమా లైనులో తొందరపాటు వల్ల ఏమీ కాదు.

★★★

## వచ్చేనెల మరో ఫ్లాష్ బ్యాక్

COMMENTS